తక్కువ వ్యవధిలోనే ఏదైనా అంశంలో నైపుణ్యం పెంపొందించుకుని, వెంటనే అందులో ఉపాధి పొందే అవకాశం ఐటీఐ ట్రేడులతో లభిస్తుంది. కొద్ది పెట్టుబడితో సొంతగా రాణించే అవకాశమూ ఉంది. ఐటీఐ పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వ రంగ సంస్థలు .. ముఖ్యంగా పరిశ్రమలు, ఉత్పత్తి, తయారీ కేంద్రాల్లో అవకాశాలు పుష్కలం. వీరి సేవలు అన్ని రంగాల్లోనూ అనివార్యం. అందువల్ల ఆసక్తి ఉన్నవారు మరో సందేహం లేకుండా ఐటీఐలో చేరిపోవచ్చు. తర్వాత ఉన్నత విద్యనూ అభ్యసించవచ్చు.

ఐటీఐ బాటలో.. అవకాశాలెన్నో!

ఐటీఐ కోర్సులో ఆసక్తి, అభిరుచుల మేరకు ఎంచుకోవడానికి దేశవ్యాప్తంగా సుమారు 130 ట్రేడ్‌లు ఉన్నాయి. వీటిలో ఏదో ఒకటి పూర్తిచేసుకున్నవారు కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు. ప్రైవేటు లోనూ ప్రతిభ చూపించవచ్చు. ట్రేడులపై గట్టి పట్టు ఉన్నవారు విదేశాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు. భారత్‌లో తయారీ (మేక్ ఇన్ ఇండియా) పెరగడం, స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఏర్పాటుతో వీరికి అవకాశాలు విస్తరించాయి.

పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను కేంద్రంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ పదోతరగతి అర్హతతో ఏడాది, రెండేళ్ల వ్యవధితో పలు ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడుల్లో కోర్సులు అందిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సుమారు 50 స్పెషలైజేషన్లు లభిస్తున్నాయి. ఏపీలో సుమారు 450, తెలంగాణలో 274 ఐటీఐలు ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ఎలాంటి పరీక్షా రాయనవసరం లేదు. పదిలో సాధించిన గ్రేడ్ పాయింట్లు/ మార్కులతో సీట్లు కేటాయిస్తారు.

ఏయే ట్రేడులు?

విద్యార్థులు వారి ఆసక్తి ప్రకారం ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల వ్యవధితో ఉన్న కోర్సులు (ట్రేడులు) ఎంచుకోవచ్చు.

రెండేళ్ల వ్యవధితో: అటెండెంట్ ఆపరేటర్ (కెమికల్ ప్లాంట్), డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్/ మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సిస్టమ్ మెయింటెనన్స్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ (కెమికల్ ప్లాంట్), మెషినిస్ట్, మెషినిస్ట్ (గ్రైండర్), మెరైన్ ఫిట్టర్, మెకానిక్ (మోటార్ వెహికల్/ రెఫ్రిజరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్), మెకానిక్ మెషీన్ టూల్ మెయింటెనన్స్, పెయింటర్ జనరల్, టర్నర్, వెసెల్ నేవిగేటర్, వైర్‌మెన్.

ఏడాది వ్యవధితో: కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్, ఫౌండ్రీమెన్, మాసన్ (బిల్డింగ్ కన్‌స్ట్రక్టర్), ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్, ప్లంబర్, వెల్డర్, సెక్రటేరియల్ ప్రాక్టీస్ (ఇంగ్లిష్), సూయింగ్ టెక్నాలజీ, షీట్ మెటల్ వర్కర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్), మెకానిక్ (డీజిల్/ఆటో బాడీ పెయింటింగ్/ ఆటో బాడీ రిపేర్)

ఉపాధి అవకాశాలు

ఐటీఐ శిక్షణ పొందినవారికి ఎక్కువగా పరిశ్రమలు, ఉత్పాదక, తయారీ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. రైల్వేలు, కేంద్ర స్థాయి సంస్థలు, పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో పెద్ద మొత్తంలో వీరి సేవలు అనివార్యం. సాంకేతిక (టెక్నికల్) పోస్టుల్లో సింహభాగం సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ చదువుకున్నవారితోనే భర్తీ చేస్తున్నారు. ఆర్మీ, ఆర్మ్‌డ్ ఫోర్సుల్లోనూ ప్రత్యేకంగా కొన్ని ఉద్యోగాలు వీరికోసమే ఉన్నాయి.

రైల్వే: వేల సంఖ్యలో ఉండే అసిస్టెంట్ లోకో పైలట్ (అసిస్టెంట్ డ్రైవర్), టెక్నీషియన్ పోస్టులకు నిర్దేశిత ట్రేడుల్లో ఐటీఐ పూర్తిచేసుకున్నవారు అర్హులు. ఎలక్ట్రీషియన్/ మెకానిక్/ ఫిట్టర్/ టర్నర్/ వైర్‌మెన్.. తదితర విభాగాలవారు అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులకు పోటీ పడవచ్చు. సంబంధిత లేదా అనుబంధ విభాగాల్లో ఐటీఐ ఉంటే టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా ఎంపికైనవారు రైల్వే వర్కుషాపులు, లోకో షెడ్, రైల్వే క్యాబిన్లలో విధులు నిర్వర్తిస్తారు. వీరిని ఎక్కువగా లెవెల్-2 పోస్టుల్లోకి తీసుకుంటారు. ఇలా అవకాశం వచ్చినవారు సుమారు రూ.30వేలకు పైగా వేతనం అందుకోవచ్చు.

రాష్ట్ర స్థాయిలో: సర్వేయర్, జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు వీరు పోటీపడవచ్చు. ఎలక్ట్రికల్ లేదా వైర్‌మెన్ ట్రేడుల్లో ఐటీఐ పూర్తిచేసుకున్నవారు జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ/ఆంధ్రప్రదేశ్‌లోని విద్యుత్తు పంపిణీ, నిర్వహణ కేంద్రాలు రెండు మూడేళ్లకు ఒక సారి ప్రకటనలు విడుదలచేస్తున్నాయి. సర్వేయింగ్ ఒక సబ్జెక్టుగా డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్) రెండేళ్ల కోర్సు పూర్తిచేసుకున్నవారు డెప్యూటీ సర్వేయర్ పోస్టులకు సిద్ధం కావచ్చు.

ఆర్మీ: సోల్జర్ ట్రేడ్స్‌మెన్ విభాగంలోని కొన్ని పోస్టులకు ఐటీఐ ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ ప్రకటనలు ఏటా వెలువడుతున్నాయి. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)...తదితర సెంట్రల్ ఆర్మ్‌డ్ విభాగాల్లో ఐటీఐ చదివినవారికి అవకాశాలు లభిస్తున్నాయి.

స్టీల్ ప్లాంట్లు, నేవల్ డాక్‌యార్డులు, నౌకాయాన సంస్థలు, పోర్టులు, షిప్పులు, ప్రజా రవాణా సంస్థలు, యంత్రాలతో నడిచే అన్ని రకాల పరిశ్రమల్లోనూ ఐటీఐ చదివినవారికి ఉద్యోగాలున్నాయి. మహారత్న, నవరత్న, మినీరత్న, పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో పలు కొలువులకు వీరే అర్హులు. పాతతరం ప్రభుత్వ ఐటీఐల్లో ప్రాంగణ నియామకాలూ జరుగుతున్నాయి. బహుళ జాతి, స్థానికంగా నెలకొల్పిన సంస్థలు వీరికి అవకాశాలు కల్పిస్తున్నాయి. నిర్మాణ రంగ సంస్థలు, ఉత్పత్తి, తయారీ పరిశ్రమల్లో వీరికి ఎక్కువ అవకాశాలుంటాయి. నైపుణ్యం ఉన్న ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, రెఫ్రిజిరేటర్ మెకానిక్‌లకు పట్టణాలు, నగరాలతోపాటు పల్లెల్లోనూ డిమాండ్ పెరుగుతోంది. అందువల్ల ఆసక్తి, నైపుణ్యం ఉంటే ఉపాధికి ఎలాంటి ఢోకా లేదు. అలాగే వీరు సొంతంగా వర్క్‌షాప్/ మెకానిక్ షెడ్ పెట్టుకుని భవిష్యత్తులో ఎంతోమందికి ఉపాధీ కల్పించవచ్చు. బిగింపు, మరమ్మతు సేవల నిమిత్తం ఆన్‌లైన్ సంస్థలూ ఉన్నాయి. అలాంటివాటిలో పేరు నమోదు చేసుకుని, చేతినిండా పనితో దూసుకుపోవచ్చు.

విదేశాలకు...

తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), ఓవర్‌సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఓమ్‌క్యాప్) విదేశీ ఉద్యోగాలకు దారి చూపుతున్నాయి. ఇవి శిక్షణ అందించి, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నాయి. వీటిని పొందినవారు కేంద్రంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ ద్వారా విదేశీ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు. ఫిట్టర్ ట్రేడ్ పూర్తిచేసుకున్నవారికి చమురు ఉత్పత్తిచేస్తోన్న దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తున్నాయి. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు సింగపూర్, మలేసియాలతోపాటు పలు దేశాల్లో ఉద్యోగాలు పొందవచ్చు. నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నవారు విదేశాల్లో రాణించగలరు.

ఉన్నత విద్య

ఐటీఐ తర్వాత డిప్లొమా కోర్సుల్లో చేరడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. కొన్ని బ్రాంచీల్లో లేటరల్ ఎంట్రీతో నేరుగా ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో చేరిపోవచ్చు. డిప్లొమా తర్వాత, ఆసక్తి ఉంటే ఈసెట్ ద్వారా నేరుగా రెండో సంవత్సరం బీటెక్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. నాన్ ఇంజినీరింగ్ బ్రాంచీల్లో ఐటీఐ ట్రేడ్‌లు పూర్తిచేసుకున్నవారు డిగ్రీ (బీఏ) ఆ తర్వాత పీజీ (ఎంఏ) కోర్సులు చదువుకోవచ్చు.

ఇన్‌స్ట్రక్టర్‌గానూ...

ఐటీఐల్లో కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్నవారు నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎస్‌టీఐ)ల్లో శిక్షణ పొందవచ్చు. విద్యానగర్ (హైదరాబాద్)లో ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మోటార్ వెహికల్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌ల్లో ఏడాది వ్యవధితో ఇన్‌స్ట్రక్టర్ కోర్సు అందిస్తున్నారు. ట్రేడుల్లో మరింత ప్రావీణ్యానికి షార్ట్ టర్మ్ విధానంలో అడ్వాన్స్‌డ్ ఒకేషనల్ ట్రైనింగ్ కోర్సులూ ఉన్నాయి.

అప్రెంటిస్‌షిప్

పని నేర్చుకోవడానికి అవకాశం లభించడంతోపాటు, ఉద్యోగ నియామకాల్లో అప్రెంటిస్‌షిప్ ప్రాధాన్యం పెరుగుతోంది. భారతీయ రైల్వే వేల సంఖ్యలో అప్రెంటిస్‌లను తీసుకుంటోంది. మహారత్న, నవరత్న, మినీరత్న సంస్థలు ఎక్కువమందికి అప్రెంటిస్ అవకాశం కల్పిస్తున్నాయి. ఈ ప్రకటనలు తరచూ వెలువడుతున్నాయి. ఈ విధానంలో చేరినవారికి ప్రతినెలా స్టైపెండ్ చెల్లిస్తారు. నియామకాల్లో కొన్ని పోస్టులను అప్రెంటిస్‌షిప్ పూర్తిచేసుకున్నవారితో భర్తీ చేస్తున్నారు. కొన్ని సంస్థలు అప్రెంటిస్‌షిప్ పూర్తయితేనే ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి. స్కిల్ ఇండియా కార్యక్రమం, మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ అంతర్‌ప్రెన్యూర్‌షిప్ ద్వారా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడం, అప్రెంటిస్‌షిప్ చేసుకునే అవకాశం ఉంది. ఐటీఐ పూర్తయిన తర్వాత అప్రెంటిస్‌గా చేరే అవకాశం కోసం https://apprenticeshipindia.org లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. **తెలంగాణలో ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు జూన్ 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌సైట్:** https://iti.telangana.gov.in/

ఆనర్స్ డిగ్రీ అంటే..?

సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్ పూర్తిచేశాను. బీఎస్సీ బయోటెక్నాలజీ చేయాలనుంది. దీంతోపాటు ఏ డ్యూయల్ డిగ్రీ చేస్తే మేలు? సాధారణ, ఆనర్స్ డిగ్రీల మధ్య ఉండే తేడా ఏమిటి?

– మణిమాల

■ మీరు ఇంటర్ తరువాత బయోటెక్నాలజీతో పాటు బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, సిస్టమ్స్ బయాలజీ, కంప్యుటేషనల్ బయాలజీ, జెనెటిక్స్, బోటనీ, జువాలజీ లాంటి వాటిల్లో నచ్చిన కోర్సులను ఎంచుకోవచ్చు. బయోటెక్నాలజీతో పాటు డ్యూయల్ డిగ్రీ చేయాలనుకుంటే పైన చెప్పిన వాటిలో ఏదైనా కోర్సుతో కలిపి చేసే అవకాశం ఉంది. ఒకవేళ మీరు విభిన్న కోర్సుతో డ్యూయల్ డిగ్రీ చేయాలనుకుంటే బిజినెస్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, జర్నలిజం, ఇంగ్లిష్ లిటరేచర్, సైకాలజీల గురించీ ఆలోచించవచ్చు. అలాకాకుండా బయోటెక్నాలజీలో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కూడా చేయవచ్చు.

ఆనర్స్ డిగ్రీ, సాధారణ డిగ్రీ మధ్య తేడా విషయానికొస్తే- సాధారణ డిగ్రీ మూడు సంవత్సరాల కాల వ్యవధిలో, మూడు సబ్జెక్టుల కలయికతో ఉంటుంది. ఆనర్స్ డిగ్రీ ఒకే సబ్జెక్టుపై లోతైన సిలబస్‌తో పాటు, దానికి సంబంధించిన మరికొన్ని సబ్జెక్టులతో పరిశోధనకు ప్రాధాన్యం ఇస్తూ, నాలుగు సంవత్సరాల వ్యవధిలో ఉంటుంది. సాధారణ డిగ్రీ చేశాక పీహెచ్‌డీ చేయాలంటే, మరో రెండు సంవత్సరాల పీజీ చేయాలి. కానీ నాలుగు సంవత్సరాల ఆనర్స్ తరువాత పీజీ చదవకుండానే నేరుగా పీహెచ్‌డీ చేయవచ్చు. ఆనర్స్ డిగ్రీ చేసినవారు ఆసక్తి ఉంటే ఏడాది కాలవ్యవధి గల పీజీ కూడా చేయవచ్చు. ఆనర్స్ డిగ్రీ చదివినవారికి వారు ఎంచుకొన్న సబ్జెక్టుపై దాదాపుగా పీజీ చేసినవారికి ఉన్నంత పట్టు ఉంటుంది. దీనివల్ల వీరికి సాధారణ డిగ్రీ చేసినవారితో పోలిస్తే పరిశోధన, ఉద్యోగావకాశాలు కొంచెం ఎక్కువగా ఉంటాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎల్లప్పుడూ.. ఉల్లాసంగా!

కొంతమంది విద్యార్థులను చూస్తే భలే ముచ్చటేస్తుంది. వాళ్లు ఎప్పుడు చూసినా ఉప్పొంగే ఉత్సాహంతో కనిపిస్తుంటారు. ఉదయం కాలేజీకి వచ్చినప్పుడు ఉన్న ఉత్సాహం సాయంత్రం వరకూ కొనసాగుతుంది. చదువే కాకుండా ఆటపాటలూ, ఇతర వ్యాపకాల్లోనూ ముందుంటారు. మరి కొందరు దీనికి పూర్తి విరుద్ధంగా.. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్టుగా కనిపిస్తుంటారు. మరి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలంటే...

● ఉత్సాహంగా ఉండలేకపోవడానికి అసలు కారణం వర్తమానంలో ఉండకపోవడమే అంటారు నిపుణులు. చాలామంది గతంలోని వైఫల్యాల గురించే ఈరోజుకీ ఆలోచిస్తూ విచారంగా ఉండిపోతారు. లేదా భవిష్యత్తులో చేయబోయే పనుల గురించి ఆలోచిస్తూ ఒత్తిడికి గురవుతుంటారు. దాంతో ఎక్కడలేని నీరసం ఆవరిస్తుంది. ఉత్సాహంగా ఉండాలంటే.. నిన్నా, రేపటి గురించి ఆలోచించడం మానేసి ఈరోజు.. ఇప్పుడు చేస్తున పని మీదే దృష్టిని కేంద్రీకరించాలి. అలాగే ఎప్పుడూ పనిలో మునిగిపోవడమే కాకుండా ఎంతో అందమైన, ఆహ్లాదకరమైన ప్రకృతినీ మధ్యలో గమనిస్తుండాలి. నీలాకాశం, పచ్చని చెట్లు, పక్షుల కువకువలు..ఇవన్నీ మీలో సహజమైన ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ప్రకృతికి దగ్గరగా ఉండేవాళ్లు ఉల్లాసంగా ఉండగలుగుతారంటారు పెద్దలు. మీరూ ప్రయత్నించి చూడటంతో తప్పులేదుగా.

● ప్రతికూల ఆలోచనల వల్ల ఒత్తిడి పెరిగిపోతుంది. పరీక్షలో మంచి ర్యాంకు రాదేమో.. అనుకున్న కాలేజీలో సీటు దక్కదేమో.. ఇలా.. కాదు, రాదు అనే ప్రతికూల ఆలోచనలుచేయడం వల్ల ఒత్తిడి పెరిగి.. ఉత్సాహం ఆవిరైపోతుంది. ధ్యానం, శ్వాస సంబంధ వ్యాయామాలతో ఈ ఒత్తిడిని నియంత్రించవచ్చు. ప్రతి విషయాన్నీ ప్రతికూలంగా కాకుండా సానుకూలంగా ఆలోచించడం వల్ల ఉత్సాహంగా ఉండగలుగుతాం.

● భారీ లక్ష్యాలను పెట్టుకుంటాం. వాటిని అందుకోలేనప్పుడు నిరాశకు గురవుతుంటాం. మన అంచనాలు వాస్తవానికి దగ్గరగా ఉంటే నిరాశపడాల్సిన అవసరం ఉండదు.

● ఉత్సాహంగా ఉండలేకపోవడానికి అసూయ కూడా కారణం అవుతుంది. ఒక్కోసారి సహ విద్యార్థులకు మంచి ర్యాంకులు రావడం కూడా మీ విచారానికి కారణం అవుతుంటుంది. అలాంటప్పుడు పోల్చుకుని బాధపడకుండా ఉండటానికి ప్రయత్నించాలి. మీ శక్తిసామర్థ్యాలు ఏమిటో మీకు బాగా తెలుసు కదా. మీరు ఏయే సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నారో తెలుసుకుని.. ఆయా అంశాలను మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నించాలి. అందుకోసం తెలివైన విద్యార్థుల సహాయం కూడా తీసుకోవచ్చు. పోల్చుకుని బాధపడటం వల్ల విచారం రెట్టింపు అవుతుంది అని తెలుసుకోవాలి.

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

కస్టమర్ ఎక్విజిషన్

సంస్థ: జై శ్రీకృష్ణా ప్యాకేజింగ్ ఇండస్ట్రీస్ **స్టైపెండ్:** నెలకు రూ. 15,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, సేల్స్ అండ్ మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/5e414b

టెక్నికల్ సపోర్ట్

సంస్థ: డిజిట్రల్ **స్టైపెండ్:** నెలకు రూ.25,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** అపాచీ, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, లినక్స్, మైఎస్‌క్యూఎల్, ఎన్‌జిన్‌క్స్, పోస్ట్‌మ్యాన్ నైపుణ్యాలు
☛ internshala.com/i/b09855

ఆడిటింగ్ అండ్ అకౌంటింగ్

సంస్థ: అక్షత కన్సల్టెంట్స్ ఎల్ఎల్‌పీ **స్టైపెండ్:** నెలకు రూ. 10,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** అకౌంటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్, ట్యాలీ నైపుణ్యాలు
☛ internshala.com/i/b9e3fa

ఆర్కిటెక్చర్

సంస్థ: ఎల్‌క్యూబ్ స్పోర్ట్స్ అండ్ ప్రాజెక్ట్స్ **స్టైపెండ్:** నెలకు రూ. 3,000-10,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** ఆర్కిటెక్చర్ సంబంధిత ఆసక్తి, నైపుణ్యం
☛ internshala.com/i/ebc079

లా

సంస్థ: ఎల్‌క్యూబ్ స్పోర్ట్స్ అండ్ ప్రాజెక్ట్స్ **స్టైపెండ్:** నెలకు రూ. 3,000-10,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** లేబర్ లాస్ నైపుణ్యం
☛ internshala.com/i/acff55

ఫిగ్మా

సంస్థ: ఎంశి ఎవెన్యూ అసోసియేట్స్ **స్టైపెండ్:** నెలకు రూ. 2,000-5,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** 3డీస్ మ్యాక్స్, అడోబ్ క్రియేటివ్ సూట్, ఫొటోషాట్ లైట్‌రూమ్ సీసీ, ఫిగ్మా, వెబ్‌ఫ్లో నైపుణ్యాలు
☛ internshala.com/i/431717

షెఫ్

సంస్థ: ఎల్‌క్యూబ్ స్పోర్ట్స్ అండ్ ప్రాజెక్ట్స్ **స్టైపెండ్:** నెలకు రూ. 3,000-10,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** షెఫ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/f41463

మార్కెటింగ్

సంస్థ: సిగ్నల్‌ఎక్స్ **స్టైపెండ్:** నెలకు రూ.15,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** డిజిటల్, ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/b2c8bc

మార్కెట్ రిసెర్చ్

సంస్థ: ఆప్టిమా ఇన్‌సైట్స్ **స్టైపెండ్:** నెలకు రూ.8,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్ నైపుణ్యాలు
☛ internshala.com/i/848353

ఇంటీరియర్ డిజైన్

సంస్థ: న్యూవే ఇంటీరియర్స్ **స్టైపెండ్:** నెలకు రూ.6,000 **దరఖాస్తు గడువు:** జూన్ 15 **అర్హతలు:** సేల్స్ నైపుణ్యం
☛ internshala.com/i/bc4725

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: ఎంశి ఎవెన్యూ అసోసియేట్స్ **స్టైపెండ్:** నెలకు రూ. 2,000-20,000 **దరఖాస్తు గడువు:** జూన్ 12 **అర్హతలు:** బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్) నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/4fa1ef

హ్యాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లొమా

తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య భారతీయ చేనేత శిక్షణ కేంద్రం మూడేళ్ల వ్యవధి ఉన్న 'డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ' కోర్సును అందిస్తోంది. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.

కోర్సు పూర్తయిన తర్వాత టెక్స్‌టెల్స్ తయారీ కంపెనీల్లో ఉద్యోగాలుంటాయి. ఇక్కడ విద్యార్థులకు మొదటి ఏడాది రూ.వెయ్యి, రెండో సంవత్సరం రూ.1100, మూడో ఏడాది రూ.1200 ఉపకార వేతనం అందిస్తారు. బాలురకు వసతి గృహం అందుబాటులో ఉంది.

శిక్షణ ఇలా..

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 10 హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థలు ఉన్నాయి. వీటిలో ఆరు కేంద్ర సంస్థలు కాగా నాలుగు రాష్ట్రస్థాయివి. వెంకటగిరిలోని ఈ సంస్థ రాష్ట్ర స్థాయిది. చేనేతకు సంబంధించి పరిశోధన, ప్రయోగాలు చేసి నాణ్యమైన ఉత్పత్తులు అందించడానికి వీటిని నెలకొల్పారు. ఈ సంస్థలన్నీ మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టెల్స్ ఆధ్వర్యంలో ఉంటాయి. మూడేళ్ల డిప్లొమాలో స్పిన్నింగ్, డ్రైయింగ్, ప్రింటింగ్, ఫినిషింగ్, డిజైన్, క్వాలిటీ పరీక్షలు, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. మూడో సంవత్సరం కోర్సులో అదనంగా అపారెల్ అండ్ గార్మెంట్ మేకింగ్ టెక్నాలజీ శిక్షణ ఇస్తున్నారు. వివిధ రకాల వస్త్రాల తయారీలో మెలకువలు నేర్పుతారు. బ్యాగులు, ఇతర వస్తువుల తయారీలోనూ తర్ఫీదు అందిస్తారు.

ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు చేనేత, జౌళి రంగ పరిశ్రమల్లో కొలువులు సాధిస్తున్నారు. కోర్సు పూర్తికాగానే కళాశాల ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. కొంతమంది విద్యార్థులు అనుభవంతో విదేశాల్లోనూ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. ఇంకా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన జౌళి, చేనేత విభాగాలు, సహకార సంఘాలలో వీరికి ఉపాధి లభిస్తుంది..

అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత
వయసు: జులై 1, 2023 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలకు 15 నుంచి 23 సంవత్సరాలు మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు.
దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నింపాలి.
దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 26, 2023
వెబ్‌సైట్: www.iihtvgr.com

- శ్యామ్, న్యూస్‌టుడే, వెంకటగిరి

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

ఏపీ మత్స్య విశ్వవిద్యాలయంలో

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, క్యాంప్ ఆఫీస్ రెండేళ్ల డిప్లొమా(ఫిషరీస్ సైన్స్) ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
బోధన మాధ్యమం: ఇంగ్లిష్
సీట్ల సంఖ్య: ప్రభుత్వ కళాశాలల్లో 55, అనుబంధ కళాశాలల్లో 440.
అర్హత: పదో తరగతి.
వయసు: 15- 22 సంవత్సరాల మధ్య ఉండాలి. **ఎంపిక:** పదో తరగతిలో సాధించిన మార్కులు, స్థానికత, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.800 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.400). **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 12.06.2023.
ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: 15.06.2023.
వెబ్ ఆప్షన్ తేదీ: 19.06.2023.
వెబ్‌సైట్: https://apfu-diplomaadmissions.aptonline.in/APFUPOLY/

ఐకార్- ఏఐఈఈపీ (పీజీ)-2023

వ్యవసాయ సంబంధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్దేశించిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్- ఆలిండియా ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్ (ఐకార్- ఏఐఈఈపీ)-2023 నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షలో సాధించిన ప్రతిభ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న 74 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న కోర్సుల్లో ప్రత్యేకించిన సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు.
విభాగాలు: ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రోనమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, కమ్యూనిటీ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్ తదితరాలు.
అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ/బీటెక్/ బీవీఎస్సీ/ బీఎఫ్ఎస్సీ.
దరఖాస్తు రుసుము: జనరల్/ యూఆర్ అభ్యర్థులకు రూ.1175; ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1150; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలు, థర్డ్ జెండర్ అభ్యర్థులకు రూ.600.
**ఆన్‌లై